


# మలుపు

మురళి పందిట్లో అడుగుపెట్టేసరికి మంగళ వాయిద్యాలు మ్రోగుతున్నాయి.

కాళ్ళు వణుకుతుండగా లోపలికి అడుగుపెట్టాడు.

రాఘవరావు మేనల్లుడిని చూసాడు. "వచ్చావా!" అన్నాడు- "ఎందుకొచ్చావు?" అన్నట్టుంది.

ఎవరెవరో పలకరించారు. ఏంచేస్తున్నావని అడిగారు. పెళ్ళెప్పుడు చేసుకుంటావన్నారు. ఎవ్వరూ ఆప్యాయంగా మాట్లాడి




నట్టేలేదు! మేనమామే ఆదరించనప్పుడు చుట్టపక్కాలు: అలా చూడటంలో ఆశ్చర్యమేముంది? ఎవ్వరూ కాఫీ తాగావా - అనికూడా అడగలేదు. నిస్సత్తువగా ఓమూల చాపమీద చతికిలబడ్డాడు.

కాస్సేపటికి రాఘవరావు చిన్న కూతురు సునంద వచ్చి తట్టేసరికి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. "బావా! నిన్ను అమ్మ రమ్మంటోంది."

పడమటింటి చావిట్లోకి తీసుకువెంళ్లిదా పిల్ల.




ముఖం గంటుపెట్టుకొని "నువ్విలా రావడం బాగో లేదయ్యా!" అంది మీనాక్షి. నిర్ఘాంతపోయేడు మురళి. అప్పుడే నలుగురూ చెవులు కొరుక్కుంటున్నారు. ఇక ముఖా నడగటమే తరువాయి....

అతనికి కళ్ళనీళ్ళు తిరిగాయి. "మిమ్మల్నెవర్నీ కష్టపెట్టాలని రాలేద త్తయ్యా!"

"మరెందుకు వచ్చినట్టు?"

"రాధ ఇష్టపడింది.... నేనూ పెళ్లి చూద్దామని వచ్చాను."

"ఏం? నీకు త్తరం వ్రాసిందా?" మీనాక్షి వెటకారంగా అంది.

"కమల తమ్ముడు వ్రాసాడు....రాధ పెళ్ళికి మరీ మరీ రమ్మందని....వచ్చాను. కాని, మీ కందరికీ ఇంత బాధ కలిగించిన వాడినవుతానని తెలిస్తే వచ్చుండేవాడినికాదు!"

"ఏమో నాయనా! ఇంత మంచి సంబంధం చేయిస్తున్నానని నన్నెవ్వరూ పొగడ్డంలేదుకాని—మళ్లీ ఏదయినా అయితేమాత్రం నేను సవతితల్లినని కాకుల్లా పొడుచుకు తింటారు. ఏదో నా గౌరవం కాపాడి అక్షింతలు పడిన వెంటనే వెళ్లిరా!" అని విసవిసా వెళ్ళి పోయింది ఆమె.

స్థాణువులా నిలబడిపోయాడు మురళి. బుగ్గలమీదకి జారిన కన్నీటిని కూడా తుడుచుకోలేదు. ఒంటిమీద ఎవరిదో స్పర్శ తగిలి ఉలిక్కిపడ్డాడు.

చేయి పట్టుకొని లాగుతున్నాడు, సునంద తర్వాతివాడు కుమార్.

చటుక్కున చొక్కా అంచులకి కళ్ళొత్తుకొని నవ్వుతూ అడిగాడు. "ఎక్కడికిరా?"

"రాధక్క నిన్ను రమ్మంటోంది...."

గుండెలు దడదడలాడాయి. "అక్కడెవరూ లేరుగా!"

వాడు ఎదురుప్రశ్న వేసేడు. "ఉంటే యేం?"

మురళి పసివాడిముందే సిగ్గుపడి పోయాడు. వాడివెంట డాబామీద గదిని చేరుకున్నాడు. పైన షామియానా, క్రింద ఎవరెవరో గుంపులు గుంపులుగా కూర్చొని పాటల్లో ఆటల్లో పడిఉన్నారు.




గదిలో రాధ ఒక్కతే ఉంది. ఆ పుత్తడి బొమ్మను చూసి కన్నులవిందు చేసుకున్నాడు మురళి.

"వచ్చాను రాధా!"

ఆమె తలత్రిప్పి చూసింది. ఒక్కసారిగా దుఃఖం పొంగి వచ్చిందామెకు.

"ఛ! ఏమిటిది రాధా! ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు!"

"ఏమయినా అనుకోనీ! నాకేం?"

ఆమె మాటలన్న తీరుచూసి జాలిగా నవ్వాడు మురళి.

"పిచ్చిరాధా!"

"ఎందుకు బావా! ఇంత ఆలశ్యం చేసావ్?"

"అదేమిటి? పెళ్లికిముందే వచ్చానుగా!"

"అయ్యో! నీకెలా చెప్పేది? ముందంటే పెళ్ళిపందిట్లోకి రమ్మనా.... ఒక వారం ముందొస్తే...."

పేలవంగా నవ్వాడతను. "ఏంలాభం? మనపెళ్ళి మామయ్యకి అత్తయ్యకి ఇష్టంలేనప్పుడు ఎంత ముందొచ్చినా ఒకటే రాధా!"

"నేనెంత నిర్భాగ్యురాల్ని! అమ్మైఉంటే.... కనీసం అత్తయ్యే ఉంటే...."

మురళికి కన్నీళ్ళాగలేదు. "వద్దు రాధా! అవన్నీ తల్చుకొని బాధపడకు. ఒకవిధంగా మామయ్య మంచిపనే చేస్తున్నాడు."

"ఓహో! ఆ మాట చెప్పటానికేనా ఇంత దూరం వచ్చావ్?"

"లేదు. నీ దగ్గర ఒక్కమాట తీసుకుందామని వచ్చాను."

"ఈ పాపిష్టి దానికంత విలువ కూడా ఉందా?"

"అదిగో అలాంటి మాటలే అనుకోకూడదు. నామీద పిచ్చి

ప్రేమతో ఎటువంటి...."

కన్నీళ్ళు బుగ్గల మీదకి పొర్లివస్తూండగానే ఫక్కున నవ్వింది రాధ. "పిచ్చిబావా! అంత సున్నిత హృదయమే నాకుంటే ఇలా ఎందుకుంటాను....నిన్ను దూరం చేసుకున్నందుకు ఈ పాటికి ప్రాణాలు తీసుకొని ఉండేదాన్ని."

"నామీద ఏమాత్రమయినా ప్రేమాభిమానాలుంటే ఇలాంటి మాట ఇంకెప్పుడూ మనసులో కూడా అనుకోకు....నామీద ఒట్టేసి చెప్పు రాధా!"

ఎవరో ఏదో తీసుకోటానికి ఆ గదిలోకి వచ్చారు. రాధ చటుక్కున తలత్రిప్పుకుంది.

బిత్తరపోయి చూస్తున్న కుమార్‌ని కబుర్లలోకి దింపాడు మురళి. ఆ వచ్చినవాళ్లు వీళ్ళవైపోసారి చూసి వెళ్ళిపోయారు.

"మనమిలా మాట్లాడుకోవటం ఎవరయినా చూస్తే బాగుండదు రాధా! ఇంక వెడతాను."

"మళ్లీ ఎప్పుడు కనిపిస్తావు?"

అతను పేలవంగా నవ్వాడు. "ఎప్పుడని చెప్పను - నువ్వు నాకందని దానివయినప్పుడు!"

"బావా!"

"చెప్పు రాధా!"

"నాకోసం మనస్సు పాడుచేసుకోకు. నువ్వు కూడా పెళ్లి చేసుకో!"

కన్నీళ్ళకన్న ముందు నవ్వు తెచ్చుకున్నాడు. "అలాగే! నీ అంత మంచిపిల్ల దొరికినప్పుడు...."

"ఛ! నాలాంటి పిరికిదాన్ని చేసుకోకు. నువ్వు సుఖపడలేవు."

నిర్ఘాంతపోయాడు మురళి.

"నాకీ లోటెలా తీరుతుంది?" తనలో తను అనుకున్నట్లుంది ఆమె.

"మనస్సు కుదుట పరచుకో! అంతా అదే సర్దుకుపోతుంది. మరి నేవెడతాను..."

"అప్పుడేనా?"




"ఊఁ! నువ్వు పెళ్ళిపీటల మీదకి వెళ్ళే వేళ దగ్గరవుతోంది. ఆ తర్వాత నాకు నీతో మాట్లాడే అవకాశమే ఉండదు.... చివర మాటొక్కటి చెప్పనా రాధా!"

"చెప్పు బావా!" కళ్ళింత చేసుకొని చూసింది రాధ.

"నేనెక్కడున్నా నా మనసు అనుక్షణం నీ సుఖశాంతుల కోసమే పరితపించిపోతుంది. నీకే కష్టాలూ రాకూడదు. ఎంత చిన్న కష్టమొచ్చినా నావల్ల నీకు మేలు జరుగుతుందని నీకనిపిస్తే ఒక్క కార్డు ముక్క రాయి... రెక్కలు కట్టుకువచ్చి వాలతాను!"

ఆమె కన్నీళ్ళు తుడుచుకోటానికి ముందే అతను గదిబయటకు వచ్చేసాడు.

* * * *

పెళ్ళయిపోయింది.

పెళ్లివారికి భోజనాలకి వడ్డింపులయిపోతున్నాయి. పిలుపులు వెళ్ళాయి....కాని, వాళ్ళెవరూ రాలేదు.

పందిట్లో అందరికీ కంగారెక్కువయింది. ఆ నోటా ఈ నోటా ఆ సంగతి మురళి చెవులదాకా వచ్చింది!

అన్నమాట ప్రకారం కట్నం డబ్బంతా ఇచ్చాడు కాదు రాఘవరావు. మిగిలిన రెండువేలు సమయానికి సమకూరలేదని....త్వరలోనే ఇస్తానంటాడతను. అంత చేతబెట్టుకోకుండా పెళ్ళి ముహూర్తం ఎందుకు పెట్టించావంటాడు పెళ్లికొడుకు తండ్రి జానకిరాం.

ఎవరో ఆడపెళ్లి వారిలో వారు నోరు జారారు. ఘర్షణ పెరిగింది. అసలువాళ్ళు తప్ప తక్కిన వాళ్ళంతా పోట్లాటలోకి దిగిపోయారు. రాఘవరావుకి కన్నీళ్ళ పర్యంతమయింది. కాని....సర్దుబాటు చేసిన వాళ్ళు లేకపోయారు.

విషయం విని విడిదిలోకి వచ్చాడు మురళి. దిగాలుపడి ఉన్న రాఘవరావుని పలకరించాడు. "ఏం జరిగింది మామయ్యా!"

"ఏం? నువ్వుకూడా ఓ పుల్ల వేద్దామనా? అయింది చాలు.




ఇక వెళ్ళు...."

మురళి నివ్వెరపోయాడు. అతని కేమనాలో తోచలేదు. క్షణం ఆలోచించాడు. చరచరా జానకిరాం దగ్గరకి వెళ్ళాడు. "మీరు మమ్మల్ని క్షమించాలి." అన్నాడు.

"ఎవరు మీరు?" జానకిరాం విసుక్కున్నాడు.

"రాఘవరావుగారి మేనల్లుడిని. మా మామయ్య డబ్బు తీసుకు రమ్మని నన్ను పంపాడు. నేను రావటం కొంచెం ఆలశ్యం అయింది....ఇప్పుడే తెచ్చాను. తీసుకోండి." అంటూ జేబులోంచి తీసి ఇరవై వంద నోట్లు లెక్కపెట్టి జానకిరాం చేతుల్లో పెట్టాడు. అతనాశ్చర్యంనుంచి తేరుకొనే లోపలే అక్కణ్ణుంచి చకచక నడుస్తూ వెళ్ళిపోయాడు మురళి!

అంతే! ఆ వార్త కార్చిచ్చులా విడిదంతా పాకిపోయింది.

"ఆ సంగతి ముందే చెప్పొచ్చుగా!" మగ పెళ్ళి వారిలో ఎవరో ఎకసెక్కమాడారు.

"మీరు వింటేగా?" ఆడ పెళ్ళివారిలో ఇంకొకరు తక్కువ తినలేదు.

"సంగతి చెప్తే ఎవరు వినరు!"

"ఏమయినా కొంచెం పట్టూ విడుపూ ఉండాలి."

"మాట నిలబెట్టుకోవటం ఉండొద్దూ!"

"ఇప్పుడు మాత్రం ఏం మునిగిపోయింది? ఆ కుర్రాడు తెచ్చిచ్చాడుగా?"

"ఇంత గొడవ జరిగేదాకా ఆగటం ఎందుకు? ముందే ఇవ్వకూడదూ!"

"ఇప్పుడే వచ్చాడండీ ఆ కుర్రాడు."

"ఆ కబుర్లు చెప్పకండి. అతను ప్రొద్దున్నే రావటం నేను చూసాను. ఇందులో ఏదో గొడవుంది!"

అంతే! ఆ తర్వాత ప్రస్తావన మరోదారి పట్టిపోయింది!....

ఒకరు తీగ లాగారు, ఇంకొకరు డొంకంతా కదిపారు. పనిలేని వాళ్ళు పప్పన్నంతో పాటు చాలా చాలా పాడు మాటలూ భోంచేసారు.




ఇందరి నోట్లోనానిన మురళి ఎప్పుడు ఎలా వెళ్ళి పోయాడో ఎవ్వరికీ తెలియదు!

పెళ్ళికూతురి కళ్ళుతుడిచే మంచి మనసే ఆ యింట్లో లేక పోయింది!

* * *

"బావా!

ఆవేళ వీడ్కోలు తీసుకుంటూ 'ఎంత చిన్న కష్టమొచ్చినా నావల్ల నీకు మేలు జరుగుతుందని నీకనిపిస్తే కార్డుముక్క వ్రాయి...' అని చెప్పావు.

ఆ సమయం చాలా త్వరగానే వచ్చింది!

రెక్కలు కట్టుకు వచ్చి వాలతానన్నావు. నిజంగా అలాగే రా! పెళ్లికి వచ్చినంత ఆలశ్యం మాత్రం చేయకు....అప్పటికి నేను ప్రాణాలతో ఉంటానో లేదో!

— అభాగ్యురాలు రాధ."

## సమాన హక్కులు

"పొగత్రాగనివాడు...." ఏదో, అవుతాడట. అసలు పొగ త్రాగడం అనేది పురుష ప్రకృతి, అది మగవారి హక్కు. పురుషులతో సమాన హక్కులు కావాలని పోరాటాలు సాగించి విదేశాలలో స్త్రీలు మొట్ట మొదట సాధించిన హక్కు, పురుషులతో సమంగా సిగిరెట్లు కాల్చడంలా, కనిపిస్తోందట! ఏ దేశంలోనైనా స్త్రీలు పురుషులతో సమాన హక్కులు పొందాలంటే ముందు సిగరెట్లు తాగడం నేర్చుకోవాలేమో! ప్రపంచ ఆరోగ్యసంస్థ మహిళా సమావేశంలో ఈ స్త్రీలు సిగరెట్లు తాగటంపై చర్చ జరిగిందట.

పెళ్ళయిన నాల్గు నెలలకే రాధ నుండి ఇటువంటి ఉత్తరం రావటంతో మురళి హృదయం విలవిల లాడిపోయింది. ఉన్నపాటున బయలుదేరాడు.

గుమ్మంలోనే ఎదురువచ్చింది మీనాక్షి. "వచ్చావా తండ్రీ! ఇంకా మానెత్తిన ఏం అపవాదులు రావాలని?"

అతను పెదవి విప్పనేలేదు.

అంతలో లోపలినుంచి రాఘవరావు వచ్చాడు. "ఏంరా? ఇంకా ఏమన్నా వేలు పట్టుకు వచ్చావా?

"మామయ్యా!" నిర్ఘాంతపోయాడు మురళి. ఇటువంటి మాట లెదురవుతాయని ఊహించలేదతను.

"నా కొంప ముంచావు కదరా!"

"నేనేం చేసాను మామయ్యా!"

"ఏంచేసావా! వెళ్ళరా.... వెళ్లి ఆ గదిలో చూడు. నీమూలంగా జీవితం నాశనమయి ఏడుస్తోందది...."

"....నిన్ను డబ్బివ్వమని ఎవరడిగారయ్యా! మా తంటా లేవో మేం పడేవాళ్ళం. ఇల్లు తాకట్టుపెట్టుకొనే వాళ్ళం. లేకపోతే ఉన్నవమ్ముకొనే వాళ్ళం. ఏంచేసినా మా పరువు దక్కేది - నువ్వు చేసిన పనికి మేమంతా ఏట్లో దూకాల్సిన పరిస్థితి వచ్చిపడింది." మీనాక్షి తనవంతు పూర్తి చేసింది.

"నీకది సుఖపడ్డం ఇష్టం లేకపోతే చంపిపారెయ్యటానికి వంద మార్గాలున్నాయి. నువ్విలా బహిరంగంగాచేసి మా అందరి ప్రాణాలూ తోడనక్కర్లేదు!...."అన్నాడు రాఘవరావు.

మురళికి కళ్ళనీళ్ళు తిరిగాయి. "ఎందుకిన్ని మాటలంటున్నారు? నేనేం చేసానని?"

"నేన్నీకు శుభలేఖ వెయ్యలేదు. పెళ్లికెవడు రమ్మన్నాడ్రా దౌర్భాగ్యుడా! వచ్చావు....వచ్చిన వాడివి తిండి తిని నీ మానాన నువ్వుపోక ఈ ఘనకార్యం ఎందుకు? అసలంత డబ్బు ఎందుకు తెచ్చావు? నువ్వుపట్టుకువెళ్ళి ఎందుకిచ్చావు?"

"నీకు మొదట్నించీ నామీద కోపం. నామాట వినిపించుకొనేలా లేవు. ఏమయినా అప్పటిలోటు తీరటమే మంచిదవి




ఇచ్చాను....నాకు మాత్రం ఎవరున్నారు? నా సంపాదనలో కొంతయినా రాధ పెళ్లి కుపయోగపడుతుందని....”

“సంపాదనట.... సంపాదన ఎవ్వరిజేబులు దోచేవో - ఎవ్వడి డబ్బు కాజేసావో!”

“మామయ్యా!....” అని గట్టిగా అరిచాడు మురళి.

అతని జ్యోతుల్లాంటి కళ్లు చూసి గతుక్కుమన్నాడు రాఘవరావు.

“రెక్కలు ముక్కలు చేసుకొని అహోరాత్రాలు కష్టపడి ఆ డబ్బు సంపాదించానో - జేబులే దోచానో ఇక్కడ కూర్చొని రంగుటద్దాల్లో చూస్తే తెలియదు మామయ్యా! నేను పనిచేసే చోటుకి వచ్చి మీ కళ్ళతో మీరు చూస్తే తెలుస్తుంది. మీకు నేనంటే అసహ్యం అని చెప్పటానికి నన్నొక దొంగని చెయ్యనక్కర్లేదు. పో. పొమ్మని మెడబట్టి గెంటుతున్నా నేనిక్కడ నిలబడి ఇంకా ఇన్ని మాటలు మాట్లాడుతున్నానంటే అభిమానం లేకకాదు - అంతకంటే అభిమానం రాధమీద ఉన్నందువల్ల”....ఆనాడూ ఈనాడూ కష్టంలో ఉన్నాను బావా అని రాధ రాస్తేనే వచ్చాను కాని నా అంతట నేను మీ కొంప ముంచుదామని రాలేదు!”

“ఏమిటే! రాధ నీకుత్తరం రాసిందా?” మీనాక్షి కళ్లు ఆ కర్ణాంతాలయ్యాయి.

“ఏమే దౌర్భాగ్యురాలా?” అని అరిచాడు రాఘవరావు.

రాధ గుమ్మంలోకి వచ్చి నిలబడింది.

“ఏం రాసావా?”

“రాసాను.” ఆమెలో నదురూ బెదురూ లేదు.

కోపంతో ఊగిసలాడిపోయాడు రాఘవరావు. రాధ చెంప ఛెళ్ళుమంది. “చావండి. కట్టుకట్టుకొని గంగలో దూకండి....”అని అరచి విసురుగా వీధిలోకి వెళ్ళిపోయాడు.

మీనాక్షి రుస రుసలాడుతూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

స్థాణువులా నిలబడిపోయాడు మురళి.

ఎంతోసేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

"మంచినీళ్ళు తీసుకో బావా!" అని తెచ్చి యిచ్చింది రాధ.

బూరెలా ఉబ్బిన ఆమె బుగ్గని చూసేసరికి అతనికి కళ్ళ నీళ్ళ పర్యంత మయింది.

"నిలబడే వున్నావు. కూర్చో!...."

కూర్చున్నాడు.

"నాకిప్పుడెంతో హాయిగా ఉంది బావా!"

వింతగా చూసాడు.

"....చివరి చూపు దక్కదేమో అనుకున్నాను. నీ చేతుల్లో చచ్చిపోయే వరం ప్రసాదించావు."

"ఏమిటీ మాటలు రాధా! నేను భరించగలననే అంటున్నావా?"

"నాకొక్క ఉపకారం చేసిపెట్టు బావా!"

పిచ్చిగా చూసాడు. "ఏమిటి?"

"ఈ బాధనుంచి విముక్తి కావాలి. నామీద జాలి ఉన్నవాడివి నువ్వొక్కడివే! అందుకనే నిన్నడుగుతున్నా. కొంచెం విషం తెచ్చి పెడతావా? నిన్నింకేమీ అడగను."

"రాధా!" గట్టిగా అరిచాడు మురళి...."నీక్కూడా నన్ను చూస్తే అసహ్యమేస్తోందా? నేనేం పాపం చేసానని! నిన్నభిమానించి నందుకా నాకీశిక్ష? ఇందుకనేనా నన్ను రమ్మని రాసావు?"

చటుక్కున లోపలికి వెళ్లి కవరొకటి తెచ్చి అతని చేతుల్లో పెట్టింది రాధ.

"ఇది చదువు...."

కన్నీటి తెరలమధ్య అక్షరా లలుముకు పోతుండగా చదివాడు మురళి.

"రాధగారికి—

నమస్కారములు.

భార్యమనసులో తనకు చోటులేదని తెలిసిన ఏ భర్తా భరించ లేడు. నేనూ అంతే!

'అమ్మాయిని ఎప్పుడు తీసుకు వెడతారు?' అని మాటి




మాటికి మా నాన్నగార్కి ఉత్తరాలు వ్రాయటం. మీ నాన్నగార్ని మానమనండి!

మీ మనస్సులో పూజలందుకుంటున్న .... వారి దగ్గరికి వెళ్ళి మీరయినా సుఖపడండి! ఇదే నేను మీకివ్వగలిగే సలహా!

—మీకేమీకాని రవి."

వెల వెలబోతూ రాధవైపు చూసాడు మురళి.

"ఇప్పుడు నాకేది దారి!"

అతనికేమనాలో తోచలేదు.

"ఇంక ఆలోచించటానికేముంది బావా! నాకు బ్రతికుండగా మనశ్శాంతి దక్కదు...."

మురళికి కోపం ముంచుకొచ్చింది. "....పెళ్ళితోటి - లేకపోతే - చావుతోటి ముగిసిపోయేది ప్రేమ అనిపించుకోదు రాధా! నామీద నీకింకా అభిమానం మిగిలుంటే ఇలాంటి మాటలు అనకు. ఇలాంటి ఆలోచనలూ చేయకు!"

రాధ నవ్వు తెచ్చి పెట్టుకుంది. "ఏం చేస్తావు? నన్నేం చేయమంటావు?"

"నేను మళ్లీ వచ్చేదాకా నిన్ను ధైర్యంతో ఉండమంటాను.

ఆశ్చర్యంగా అడిగింది. "ఎక్కడికి వెడతావు?"

"రవి దగ్గరకి. నావల్ల వచ్చిన చెడ్డపేరు నేనే తుడిచివేస్తాను."

ఆమె చిత్తరువే అయింది!

* * *

"రవిగారూ! మీ కోసం ఎవరో బయట వెయిట్ చేస్తున్నారు." కొలీగ్ చెప్పటంతో పర్మిషను పెట్టి ఆఫీసు బయటకు వచ్చాడు రవి.

మురళి చిరునవ్వు నవ్వాడు, "గుర్తుపట్టారా....?"

"ఎక్కడో చూసినట్టుంది. కాని...."

"మీకభ్యంతరం లేకపోతే అటొకసారొస్తారా? అన్నీ చెపు

తాను." మురళి వెంట లాన్స్ వైపు నడిచాడు రవి.

"అపార్థం చేసుకోనంటే మీకో నిజం చెప్పాలని వచ్చాను."

"ముందు మీరెవరో సరిగా తెలియందే!" అన్నాడు రవి నవ్వుతూ.

"నేను రాఘవరావుగారి మేనల్లుడిని, మురళిని."

రవిముఖం జేవురించింది. "ఓహో! తమరేనా ఆ మహానుభావులు—"

"క్షమించండి, మీరు నా గురించేం విన్నారో నాకు తెలియదు. నేను చెడ్డవాడిని మాత్రం కాదు."

"మీరెందుకు చెడ్డవారవుతారు! అయితే నేనవాలికాని!"

"మీరూకారు.... మీరు చెడ్డవారయితే అటువంటి ఉత్తరం రాధకి రాసేవారే కాదు."

చురుక్కున చూసాడు రవి. "ఓహో! ఎగిరి గంతేసి మీకు ఆహ్వానం పంపిందనుకుంటాను."

"నేనేం చెపుదామనుకున్నా మీరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. అది నా దురదృష్టం!"

రవి కోపంగా తలతిప్పుకున్నాడు.

"....మీరు నాకంటే చదువుకున్నవారు, తెలివైనవారు. మీకు చెప్పవల్సినవాడిని కాదు. కాని ఒక్కమాట చెపుదామని వచ్చాను. మీరు విన్నాక ఇంకా సమాధాన పడకపోతే....వచ్చిన దారినే వెడతాను. మిమ్మల్ని బాధ పెట్టను. ఏమంటారు?"

రవి సూటిగా చూస్తూ "ఏమిటో చెప్పండి." అన్నాడు.

"రాధకు తల్లిలేదు. నాకు తల్లి దండ్రులిద్దరూలేరు, కాని, వాళ్ళల్లో ఎవరు బ్రతికున్నా మా జీవితం మరొకలా ఉండేది. నేను మీతో అబద్ధం చెప్పను - మేమిద్దరం ఊహ తెల్సినప్పట్నించీ పెళ్ళి చేసుకుందామనుకున్నది నిజం!...."

రవి చూపులు తీక్షణంగా మారాయి. "అదే నేననేదీను, అలా కాకుండా ఇలా ఎందుకు జరిగింది? నిష్కారణంగా నా జీవితం ఎందుకు నాశనం చేసారు?"

"ఒక్క క్షణం నిష్పక్షపాతంగా ఆలోచించండి. తెల్సి మీకప

కారం చేస్తామా? నేను చేసానం టారా? నాకు దీనివల్ల ఒరిగేదే ముంది బాధేకాని. ఇకరాధ-తల్లి దండ్రుల చాటుపిల్ల. ఆమెకు స్వతంత్రం ఎక్కడిది?"




"చేతులారా ఆమె గొంతు కోయటం ఎందుకు?"

"అని మీరూ, నేను అనుకుంటాము. కాని,పిల్ల సుఖపడాలని చేసామని వాళ్ళంటారు. ఒక విధంగా వాళ్ళను కున్నదే రైటు...."

రవి తెల్లబోయాడు.

"నేను ఎవ్వరూ లేనివాడిని. పెద్ద చదువులు చదవని వాడిని. గవర్నమెంటు ఉద్యోగం లేనివాడిని. పెళ్ళాన్ని ప్రేమించటం తప్ప సరిగా పోషించగలనో లేదో! అలా వాళ్ళనుకోవటంలో తప్పులేదు. కన్నబిడ్డకి ఓ మంచి సంబంధం చూడటమూ తప్పులేదు. వాళ్ళెంతో ఆలోచించి ఈ పెళ్ళిచేసారు. రాధ మేలు కోరే చేసారు. రాధ కూడా సమాధాన పడింది. మీ మీద ఇష్టం లేకపోతే పెళ్ళి పీటలమీద కూర్చొనేదేనా?"

"నాకీ బలవంతపు పెళ్ళంటే ఇష్టంలేదు."

మురళి నవ్వాడు. "అలా అని మీరెందుకను కుంటున్నారు?"

---

## అచ్చిరాని 'కె'

'కె' అక్షరంలో ప్రారంభమైన ఆనకట్టల దురదృష్టమేమో కాని అన్నీ బీటలువారి పోతున్నాయి. లేదా ఏదో ప్రమాదం తెచ్చి పెడు తున్నాయి. భారతదేశంలోని కొయనా ఆనకట్ట, కెన్యాలోని కొరిబాడాం, గ్రీసులోని క్రమస్తాడాం, బ్రెజిల్‌లోని కజరూ ఆనకట్ట....ఇప్పుడు కేరళలోని కుట్టియాడె ఆనకట్ట కూడా దెబ్బతిన్నది.

అందుకని కొయనా హైడ్రోఎలెక్ట్రిక్ ప్రాజక్టువద్ద కొల్కెవాడి గ్రామస్తులు, ఆ కొల్కెవాడి పేరును బాల్వద్వాడిగా మార్చారు.

"మీరెన్ని చెప్పండి. ఒక్కటిమాత్రం నిజం.ఆమె మనస్సులో నాకు చోటులేదు. అది మీ సొంతం...."

"ఛ! అలా ఎందుకను కుంటారు?"

"....పీటలమీద నా ప్రక్కన కూర్చున్నప్పుడు నేను కళ్ళారా చూసాను. ఆ ముఖంలో కాంతిలేదు. చిరునవ్వులేదు. మచ్చుకయినా పెళ్ళవుతున్న సంతోషం లేదు. పైగా కన్నీళ్ళున్నాయి....ఇంకా ఋజువేంకావాలి? ఆ తర్వాత అసలు విషయమూ తెల్సింది. మీరు డబ్బు ఇవ్వటం ....అందరూ...."

"....అలా నానా రకాలుగా అనుకుంటారని ఊహించి ఉంటే ఆ పని చేసుండేవాడినే కాదు. మా మామయ్యకి నామీద మంచి అభిప్రాయంలేదు. నేనుదురాశ కొద్దీ పెళ్ళి చెడకొట్టటానికే వచ్చాననుకున్నాడు. నా మాటలు వినే స్థితిలోలేదు. డబ్బు మూలంగా పెళ్ళి పందిట్లో కలతలు రేగటం చూడలేక పోయాను. నా తొందరపాటులో ఊహించనిఅపకారం జరిగిపోయింది....కొంచెమున్న దాన్ని కొండంత చేసి చెప్పుకున్నారంతా! రాధ పెళ్ళికి అవసరమయితే సాయం చేయటానికి పనికి వస్తుందేమోనని డబ్బు తెచ్చాను. తెచ్చినందుకు ఉపయోగ పడిందని సంతోషించాను. కాని అదే ఆమె జీవితంలో చిచ్చు పెడుతుందని ఊహించి ఉంటే తెచ్చేవాడినే కాదు- అసలు నేనొచ్చేవాడినే కాదు—" కాసేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

"సరే, ఇప్పుడు నన్నేంచేయ మంటారు?" రవి నిదానంగా చూసాడు.

"నిజం మీకు చెప్పాను, మీరు మంచి మనసున్నవాళ్ళు. ఆమెని ఆదరించండి, నేను చేసిన పని ఓ అన్నయ్య చెల్లెలికిచ్చిన కానుకగా గుర్తించండి!"

రవి వెలవెలబోతూ చూశాడు.

"నన్నంతా అసహ్యించు కుంటున్నారు. అదినాకు బాధలేదు. కాని, నా మూలంగా రాధకు అపవాదు వచ్చింది.అది తుడిచి వేయటం మీ ఒక్కరి చేతిలోనే ఉంది. మా ఇద్దరి జీవితాలు మీ చేతిలో ఉన్నాయి...." రవి తలత్రిప్పి ఎటో చూసాడు.

"మీ మనస్సులో ఏముందో నేనూహించగలను! రాధ మన




స్సులో మీకు చోటు ఉండదేమో నని కదూ!.... మీరు కాలేజీలో చదువుకు న్నారు, ఎంతోమంది అందమైన ఆడపిల్లల్ని చూసి ఉం టారు. పరిచయం కలిగి ఉంటారు. అందులో ఎవర్నో పెళ్ళి చేసుకో వాలని ఒక్కసారయినా అనుకొని ఉంటారు! అలాగని....ఇప్పుడు మీ మనస్సులో తనకిచోటు లేదని రాధ అనుకోవటం న్యాయ మంటారా?

పెళ్ళయేవరకు మనస్సులోకి అనేక మంది వస్తుంటారు....పోతుం టారు. ఆ తర్వాతనే జీవితానికి నిలకడ చిక్కేది. రేపు రాధా అంతే! చిన్నప్పట్నించి పెద్దవాళ్ళు మాలో లేనిపోని ఆశలు పెంచారు. అందు వల్ల ఆమె మనస్సు మార్చుకోవటానికి కొంచెం టైము పడుతుంది. ఇంకా చిన్నది. అనుభవం లేనిది. మీరు కొంచెం కనిపెట్టి చూస్తే ఆమె మనస్సులో మీరు పూజలందుకొనే రోజు అట్టేదూరం ఉండదు! మీరెంతో గొప్ప మనస్సు కలవారని నమ్మకంతో వచ్చాను. తన జీవి తం నిలబెడతానని ఆమెకు మాటిచ్చి వచ్చాను. నేనుతెచ్చే మంచి మాట కోసం ఆమె ఎదురు చూస్తూంటుంది. కాని, మీరేవెడితే ఆమె సంతోషానికి అంతుండదు. చూడండి....వెళ్ళి మీకళ్ళతో మీరే చూడండి."

రవి తలత్రిప్పి చూసాడు! అతని కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. మురళి ప్రేమగా అతని చేయి అందుకొని ప్రేళ్ళు నొక్కాడు!

* * *

ఎన్ని ఉత్తరాలు వ్రాసినా రాని అల్లుడు కబురు చేయకుండానే హఠాత్తుగా వచ్చేసరికి నిర్ఘాంత పోయాడు రాఘవరావు. రవి ముఖం మీద చిరునవ్వుచూసి మరీ ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత రవి చెప్పే కబుర్లు వింటున్నప్పుడు అతని ఆనందానికి పట్టుపగ్గాలే లేక పోయాయి.

"అక్కా! బావ నిన్ను డాబామీదికి రమ్మంటున్నాడు!" అని సునంద పిల్చినప్పుడు రాధకు గుండెలు గుబగుబ లాడాయి. ప్రాణా లరచేత బట్టుకొని ఆ గదిలో అడుగు పెట్టింది.




గజగజ వణికిపోతూ నిలబడి పోయిన ఆమెను పొదివి పట్టుకున్నాడు రవి. ఆమెఒళ్ళు ఝల్లుమంది.

"రాధా!"

చెంపలు పగిలి పోతాయేమో నన్నట్లు నవనాడులు బిగబట్టింది

"ఎందుకింత భయపడుతున్నావు?"—అతని మాటలు, బుగ్గల మీద అతని మృదువైన స్పర్శ....గడ్డకట్టిన ఆమె రక్తాన్ని తిరిగి ప్రవహింప జేసాయి.

"ఏమండీ!....నన్ను క్షమించండి!" అంటూ గబుక్కున అతని పాదాలమీద వాలిపోయింది.

ఆమెను చటుక్కున లేవనెత్తి గుండెలకు హత్తుకున్నాడు రవి. "అలాంటి ఉత్తరం రాసినందుకు నన్ను నువ్వే క్షమించాలి. సమయానికి మురళి వచ్చి నా కళ్ళు తెరిపించాడు."

ఆమె బుగ్గ లెర్రనయ్యాయి. రవి నవ్వాడు. "నేను మీ బావంత మంచివాడిని కాదుసుమా!"

ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. "బావ నిజంగా దురదృష్టవంతుడు. అతని మంచితనం గుర్తించటానికి మనుషులే లేకపోయారు ఇన్నాళ్ళూ!"

"అదేమిటి? నేను మనిషిని కానూ?" మేలమాడాడు రవి.

"మీది గొప్పమనస్సు....అందుకనే మీరు నాకు దక్కారు."

"రేపే మన ప్రయాణం!....ఎక్కడికో తెలుసా?? ముందు మీ బావ దగ్గరికి...."

ఆమె పరవశంతో అతని గుండెల్లో తల దాచుకొని కళ్ళు మూసుకుంది.

***

Published by K. Rajendra Babu, 80, Dhanalaxmi Colony, Madras-600 026., and Printed by Sri Vijaya Bapineedu at Vijaya Graphics, 8, Arcot Road, Madras-600 026. Phone: 421616
Editor: VIJAYA BAPINEEDU.